గొప్పవారింట్లో అలంకరణ వస్తువుగా మిగిలిన సత్యదేవతకి విముక్తి ఎప్పుడు?

# సత్యానికి ముసుగు

## అడివి సూర్యకుమారి కథ

''యమధరమరాజు వెనకటంత దరమరాజు కాదే మొగుడి ప్రాణాలు మళ్లీ ఇవ్వడానికి పోనీ తెగించి వెంటపడ్డావే అనుకో యముడితో లేచిపోయిందంటుంది లోకం.

దగాపడ్డ చెల్లెలా! నువ్వున్న సమాజం ఎట్లాంటిది? కళ్లు తెరిచి నిజం తెలుసుకోవే'' బోర్లాపడిన ఆమెను లేవదీస్తూ అన్నాడు సూరీడు.

సేటు కుబేర్రావు వాకిట్లో బోర్లాపడిపోయి భోరుభోరున ఏడుస్తోంది సీతాలు.

సేటుగారి పనివాళ్లు ఆమెని బైటికి గెంటి గేట్లు వేశారు.

సూరీడు సాయంతో లేచి నిలబడింది సీతాలు. ఈ దేశంలో ఆడవాళ్లు ఐదు మీటర్లు, ఐదున్నర మీటర్లు, ఆరు మీటర్ల చీరలు కడుతున్నారు. నేతవాళ్లు నేస్తున్నారు. కాని సీతాలు చీరెలాంటిది కనపడ్డం కష్టమే. అది మహా వుంటే మూడున్నర మీటర్లుంటుంది. అందులోనూ మూడొంతులు రంధ్రాలే.


కుబేర్రావు సందిట్లో వున్న అందాలభామమీద ఒంటిమీదుంది మూడున్నర మీటర్ల పీలికల గుడ్డే. ఆ కాస్త గుడ్డకూడా దేనికని అందాలభామ అవస్థ పడ్తుంటే ఉన్న బట్ట చాలక శరీరం కనపడకుండా కప్పుకోడానికి తంటాలు పడ్తోంది సీతాలు. ఒంటికంటిన మట్టి దులుపుకుంటూ ''ఆడి సెయ్యి కాలు మిస్లమధ్య నలిగిపోయాయిగదా! నాకేదయ్యా దారీ అంటే...''

''అంటే... ఏమన్నాడే సేటుగారూ?''

సీతాలు నోట్లో కుక్కుకోను బట్టలేక చెయ్యడ్డుపెట్టుకుని ఏడ్చింది.

''చెప్పవే. చెప్పి ఏడు. మీకున్న ధనం ఇదేగా'' అన్నాడు సూరీడు.

''నేను... నీలాంటోళ్లతో తిరుగుతాన్న.



వంచిదాన్నిగాదట. అందుకని నాకే సాయం సేయట్ట''

సూరీడు ఈ మాటలు విని బిగ్గరగా నవ్వాడు.

సేటుగారు గొప్ప రాజకీయం తెలిసినోడే సీతాలు. అతని వాక్యం ఇంకా పూర్తికాలేదు. మాలక్ష్మి పెద్దగా అరుస్తూ తిడుతూ వచ్చిందక్కడికి.

''ఓరి తాగుబోతు సచ్చినాడా! ఇక్కడున్నావా! నీకోసం వెదకలేక ఛస్తున్నా! ఈ పూట కూడా పన్లోకి

పోవా!'' అంది కోపంగా చూస్తూ.

''ఒసే అప్పా ఎంతకాలం చేసినా అదే కూలి అదే మిసను. అదే పని. మార్పే[illegible]కులో! అప్పా! నీకు సీతాలుకి ఓ బ్రహ్మ రహస్యం చెబుతా ఇనండే...

వ్యాపారం చేసేవాడు వ్యాపారి. వ్యభిచారం చేసేవాడు వ్యభిచారి. ఈ రెండూ చేసేవాడు ఎవడే అప్పా రాజకీయవాది... హిహిహి... వాడే మన సేటు కుబేర్రావు. హీహీహీ...'' నవ్వుతూన్న తమ్ముణ్ణి రెక్క పుచ్చుకుని బరబర ఈడ్చుకొచ్చినట్టు. అక్కణ్ణించి ఇవతలకి లాక్కొచ్చింది మాలక్ష్మి.

''నీ నోరుపడ! సేటు వింటే ఈ మాత్రం గంజికూడా కరువౌతుందిరా'' అంది. సీతాలు మొర సీటుదాకా దాటిపోలేదు. దాని కన్నీరు భూదేవి దాచుకుంటోంది. అది ఏడుస్తూ వారి వెనకే తన గుడిసెవేపు వెళ్తోంది.

సూరీణ్ణి లాక్కెళ్లిన మాలక్ష్మి వాడినెత్తిన ఓ కుండెడు నీళ్లు గుమ్మరించింది.

''మత్తు దిగిందిరా!''

''ఊపిరాడక ఛస్తుంటిని గదే''

''ఇంకా కాసేపక్కడే వుండి వాదుర్తుంటే సేటు మనుషులు నిన్ను నిజంగా చంపేసేవోళ్లురా! పో, పోయి గుడ్డలు మార్చుకుని పన్లోకి పో!

''అప్పా సీతాలు...''

''నాకు తెల్సురా! మన బతుకులు హోరుగాలిలో దీపాలు. ఇంత గంజి ఉట్టిమీదుంది. తాగిపో. నేనూ... పన్లోకి పోతున్నా'' అంది మాలక్ష్మి బైటికి వెళ్తూ.

సూరీడు గొణుక్కుంటూ గుడిసెలోపలికెళ్లాడు. కాకిలాగు, చొక్కా వేసుకుని బైటకొచ్చి ''నే పోతున్నానప్పా!'' అరిచాడు. వెళ్తున్న మాలక్ష్మి వెనక్కి తిరిగి చెయ్యూపింది.

రోజంతా ఫ్యాక్టరీలో కష్టపడి ఇంత గంజితాగి, తమవాడకి, పెద్దోళ్ల ఇళ్లకి మధ్య ఉన్న కాలవపై కట్టిన ఇనప వంతెనమీద నిలబడ్డాడు సూరీడు.

ఆకాశంలోకి చూడసాగాడు.

అనేక నక్షత్రాలు.

వలయాలు, వలయాలుగా నక్షత్రధూమాలు. వాటిల్లోనుండి ఓకాంతి ఉల్కలా భూమ్మీదికొస్తోంది.

సూరీడది ఉల్కనే అనుకున్నాడు. కానీ... అది ఉల్క కాదు.

సూరీడు ఆశ్చర్యంగా ఆ వెలుగుకేసి చూస్తున్నాడు.

అదేమిటి? ఆ కాంతి అంతా ఆకారాన్ని ధరిస్తోంది! ఆశ్చర్యం! ఏమిటా ఆకారం! ఓ స్త్రీమూర్తి. ఔను స్త్రీ ఆకారమే.

అయ్యో! ఆ స్త్రీకి బట్టల్లేవు. ఆమె నగ్నంగా వుందేమిటి?

అరె! ఆమె నావైపే చూస్తోంది. ఆ ఆకారం చిన్నదిగా ఎలా మారిపోతోందో!

అమ్మయ్య చేతికందుకబాటులోకొచ్చింది. ఏమిటీ విచిత్ర సంఘటన! ఆ రూపం ఇంత చిన్న బొమ్మగా ఎలా మారింది? అందుకున్నాడు.

ఈమె మామూలు స్త్రీమూర్తికాదు. దేవత... ఇది దేవతా విగ్రహం... ఈమె నాదగ్గరికొచ్చిందేమిటి? ఈమె ఎవరై వుంటుంది?

అతనో నిమిషం బొమ్మను పరిశీలనగా చూసి

''ఔను. ఈమె సత్యదేవత. ఈమెను సేట్ కుబేర్రావుకి పంపిస్తాను. ఓ దేవతా! నిన్ను కుబేర్రావు దగ్గరకు పంపుతున్నాను''

సత్యదేవత నవ్వుతోంది.

సూరీడు ఓ క్షణం ఆశ్చర్యంగా చూసి, అయినా తన నిర్ణయం మార్చుకోండా సేటుగారింటివైపు నడిచాడు.

సేటుగారి బాడీగార్డ్సు అతణ్ణి ఆపారు.

"అయ్యగారిని చూడాలి'' అన్నాడు సూరీడు.

ఓసారి సూరీణ్ణి ఎగాదిగా చూశారు వాళ్లు. అతని చేతిలో మెరిసిపోతున్న బొమ్మను చూసి అది అయ్యగారికివ్వడానికి వచ్చాడని గ్రహించారు. కాని అయ్యగారిప్పుడు వీణ్ణి చూసే స్థితిలో లేరు.

''ఆ బొమ్మనిలా ఇచ్చెయ్యి. తర్వాత మేమిస్తాం'' సూరీడు సత్యదేవతని కుబేర్రావు మనుషులకిచ్చి వెనుదిరిగాడు.

తెల్లవారింది. కుబేర్రావు నిద్రలేచాడు. ఎదురుగా వున్న టేబుల్‌మీద సత్యదేవి విగ్రహం బొమ్మను చూసి కళ్లు చిట్లించి నౌకర్ని కేకేశాడు.

''ఏమిట్రా అది?'' అని అరిచాడు.

నౌకరువచ్చి ''ఊరికి దూరంగా, మురికివాడలో బతికే కార్మికుడొకడు ఇచ్చాడు సార్'' అన్నాడు విగ్రహాన్ని కుబేర్రావు చేతికిచ్చి.

కుబేర్రావు బొమ్మని పరిశీలనగా చూసి ఉలిక్కిపడ్డాడు. చటుక్కున మంచం దిగాడు.

విగ్రహాన్ని టేబుల్‌మీదుంచి భక్తితో చేతులు జోడించి -

''ఎంత అపచారం! అమ్మవారికి గుడ్డలు కట్టండి. ఒరేయ్! మంచి పట్టుబట్టలు తేండిరా! ఈ సత్యదేవికి గుడ్డలు కడతాను''

''అట్లాగే సార్''

''ఈ కూలి వెధవలకి ఎంత నిర్లజ్జ, తెగింపు! ఈ దేవిని నగ్నంగా వుంచుతారా!'' కుబేర్రావు ఆమెనలా చూడలేకున్నాడు.


పది నిమిషాల్లో అతని పి.ఎ. పట్టుబట్టలతో వచ్చాడు.

''అయ్యా! ఇవిగో అమ్మవారి దుస్తులు!''

కుబేర్రావ్ లోపల స్నానాదులు ముగించి, శుచియై కూర్చున్నాడు. పి.ఏ తెచ్చిన పట్టుబట్టలతో అమ్మవారిని చుట్టేసి, దేవతా పీఠంపై కూర్చోపెట్టాడు.

''తల్లీ! నువ్వలా నగ్నంగా తిరక్కూడదు. అలా తిరిగితే మా పరువేంకాను? ఊ!! నువ్విలా ఖరీదైన దుస్తుల మాటున వుంటేనే బావుంటుంది'' అని మనవి చేసుకుంటున్నాడు. ఇంతలో పి.ఎ. వచ్చి - ''అయ్యా! స్వామి బ్రహ్మానంద దయచేశారు!'' అన్నాడు.

కుబేర్రావ్ విగ్రహం ముందునుండి లేచి ''నేనే వారిని లోపలికి తీసుకరావాలి. పద! సత్యదేవి అందాకా ఇక్కడే వుండు'' అనిస్వామీజీని



తీసుకురావడానికి వెళ్లిపోయాడు. [redacted]

సత్యదేవత పట్టుబట్టలవరాటున ఉక్కిరిబిక్కిరవుతోంది.

''హరిఓం తత్సత్'' అంటూ స్వామీజీ ఆ గదిలో ప్రవేశించాడు. కుబేర్రావ్ ఆయన కూర్చోవడానికి మంచి ఖరీదైన కుర్చీ, వెండి తాపడం చేసినది చూపించాడు.

స్వామి కుబేర్రావుని చూస్తూ సత్సంప్రదాయ నిర్వహణకోసం, ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రజల్లో నిలపడంకోసం మేము అహర్నిశలు ఎంత శ్రమిస్తున్నామో నీకు తెలుసు'' అన్నారు.

కుబేర్రావ్ చేతులు జోడించి ''భగవాన్! మీరు దైవస్వరూపులు. మీవంటివారుండబట్టే ఈ ప్రపంచం ఈ మాత్రంగానైనా నడుస్తోంది. మీ తదుపరి కార్యక్రమం సెలవిస్తే నేను చేయవలసిందేమిటో నిర్ణయించుకుంటాను'' అన్నాడు.

''రాత్రికి మంత్రిగారింట్లో మా అనుగ్రహ భాషణం వుంటుంది. తర్వాత మా విదేశీ ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లగురించి మాట్లాడి మేం ఆశ్రమానికి తిరిగొస్తాం''

''అర్థమైంది భగవాన్! మంత్రిగారి పి.ఏతో ఇప్పుడే మాట్లాడతాను''

అంటుండగానే కుబేర్రావ్ పి.ఎ డయల్ చేసి ఫోన్ కుబేర్రావుకి అందించాడు.

''హలో కృష్ణశాస్త్రిగారా! నేను కుబేర్రావ్‌ని మాట్లాడుతున్నా! మన స్వాములవారి ప్రయాణం సంగతేం చేశారు! ఆ ఖర్చంతా ప్రభుత్వం భరించాల్సిందే! వారి అనుగ్రహ భాషణం విదేశీయులక్కూడా అందజేయాల్సిన బాధ్యత మనందరిమీదా వుంది. అలాగే... ఆ''

''ఏమంటున్నాడు కృష్ణశాస్త్రి?'' అడిగారు స్వామి.

''తమరి సంకల్పం దైవసంకల్పం. దానికి అడ్డేమిటి? అలాగే అన్ని ఏర్పాట్లు చేస్తానంటున్నాడు''

స్వామి కళ్లు దేవీమూర్తిమీద పడ్డాయి. ఆమెకి చుట్టిన పట్టువస్త్రం జారిపడింది.

''ఇదేమిటి? పవిత్రమైన ఈ దేవీమూర్తినిలా నగ్నంగా నిలుచోబెట్టిందెవరు?'' అడిగాడు కోపంగా చూస్తూ.

''క్షమించాలి. మూర్ఖుడైన కార్మికుడొకడు ఈమెను నగ్నంగానే వుంచి నాకు పంపాడు. నేనీమెను ఖరీదైన పట్టుబట్టల్లో చుట్టాను గాని...''

''ఈ దేవి నగ్నంగా వుండరాదు. ఈమెకు బట్టలు ధరింపజేయండి. ఇది మా ఆజ్ఞ'' అన్నాడు స్వామి.

స్వాములవార్ల పీఠం సత్యదేవతను నగ్నంగా తిరగరాదని శాసించింది.

పి.ఎ స్వామిదగ్గరకొచ్చి ''స్వామీ ఇండస్ట్రియలిస్టు శాంక్యాయనగారొచ్చాను. తమను చూడాలని'' అన్నాడు.

''రమ్మను'' అన్నారు స్వామి.

శాంఖ్యాయన లోపలికొచ్చి ''మహాస్వామికి నమస్కారం'' అన్నాడు.

''క్షేమమా! నీ ఇండస్ట్రీలెలా వున్నాయి?'' అడిగాడు స్వామి.

''తమ దయవలన లాభాలతో నడుస్తున్నాయి స్వామీ. ఈ సాయంకాలం మా నూతన గృహంలో మీ పాదం వుంచి పావనం చేయాలని మా కోరిక. మీకు పాదపూజ చేసుకుంటాం. పాదపూజకి కట్నంగా ఐదు లక్షలిచ్చుకుంటాను.

''అలాగే'' అన్నారు స్వామి.

''మరి జడ్జిగారింట్లో సాయంకాలం గంటసేపు మీ భాషణం. తదుపరి దేవాలయంలో భారీ ఏర్పాట్లు జరిగాయి. ప్రజలు మీ మాటలు వినడానికి

ఉదయంనుండి కాచుకుని ఉన్నార్ట'' ఆదుర్దాగా అడిగాడు పి.ఏ.

స్వామి విసుగ్గా చూశారు పి.ఏవైపు. ''వీలునుబట్టి చూద్దాం'' అంటూ లేచాడు.

శాంఖ్యాయన మొహం వికసించింది.

"నా ఎయిర్‌కండిషన్డ్ కారులో వెళదాం స్వామి''

''మరి నా ఏనుగు?'' అది మన కారు వెనకాలొస్తుంది''

స్వామి శాంఖ్యాయన వెంట వెళ్లిపోయారు. కుబేర్రావు స్వామికి వీడ్కోలిచ్చాడు.

''ఐదు లక్షలు పాదకట్నం. అందుకే స్వామి అటు వెళ్లారు. ధనమూలమిదం జగత్ అన్నది ఇందుకే మరి'' అనుకున్నాడు కుబేర్రావ్.

లోపల సత్యదేవి చిరాకు పడిపోతోంది.

ఆమెకి గట్టిగా ఖరీదైన జరీబట్టలు చుట్టారు.

''నన్నిలా బంధిస్తూ తీర్పునిస్తారా! నా తరఫున మాట్లాడేవాడెవడూ లేడా! చూస్తాను. ఎవడైనా వున్నాడేమో''

అనుకుంటూ సత్యదేవి బైలుదేరిది. ధనవంతుల లోగిళ్లు, బజార్లు చూసింది. భక్తుల ఇళ్లు గుళ్లు గోపురాలు ప్రార్థనా స్థలాలన్నీ వెదికింది. చివరికి శ్రామికవాడ చేరుకుంది.

ఫ్యాక్టరీనుండి వస్తున్నాడు సూరీడు.

ఆమెను చూసి చిన్నగా నవ్వాడు వాడు.

''ఏ తల్లీ. అక్కడ వుండలేకపోయావా! మళ్లీ నా దగ్గరకే వచ్చావ్?'' అడిగాడు.

''ఔను. నేను న్యాయం కోసం వచ్చాను. నా తరఫున వాదించే వాడెవడూ కన్పించలేదు నాకు'' అంది దేవి విచారంగా.

''అట్లాగా! అయితే సరే! అదిగో మా కాలనీలోనే ఆ చివర్న ఒకాయనుంటాడు. మాకోసం మాట్లాడుతూ అప్పుడప్పుడు జైలుకూ్కడా పోతుంటాడు పాపం. ఆయన లాయరు. ఆయన్ని కలుసుకో'' అన్నాడు.

సత్యదేవత కాలనీ చివరనున్న లాయర్ దగ్గరకొచ్చింది. లాయర్ చుట్టూ బోల్డంతమంది అభాగ్యులు, అభాగినులు వున్నారు. వారి కళ్లల్లో దీనత్వం, మొహాల్లో విచారం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. లాయర్ సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

ఇంతలో సత్యదేవత అతని కళ్లముందు నిలబడింది. లాయర్ ఆశ్చర్యంగా


## పెట్టుబడి

''నేనీ ఊరికొచ్చినప్పుడు నా జేబులో కేవలం పదే రూపాయలున్నాయి!'' అన్నాడు అప్పారావు

''మీరు దానిని ఎలా పెట్టుబడి పెట్టారు?''

ఆ పదిరూపాయలతో డబ్బుని పంపించమని ఇంటికి టెలిగ్రాం ఇచ్చాను'' చెప్పాడు అప్పారావు.

- కె.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)



చూస్తున్నాడామెను.

నీలాంటి మేధావి మౌనంగా ఊరుకోరాదు. వెన్నెముకలేని మేధావులు జాతికనవసరం. లే! ఈ జనాన్ని మేల్కొల్పు. జాగృతి కలిగించు. చైతన్యదీపం వెలిగించు'' అంది.

లాయర్ నిలబడ్డాడు. తన ముందున్న వారి కళ్లలోని ఆకలి మంటలు చూశాడు.

''నా ప్రియమైన కార్మిక సోదరులారా? మీ జీవితాలు కనీసావసరాలు తీరక మసిబారుతున్నాయి'' మీ కష్టంతో కుబేర్రావ్‌లాంటి యజమానులు మేడమీద మేడలు కడుతున్నారు. మీ దగ్గర దరిద్రం, అవిద్య, నిరుద్యోగం, అజ్ఞానం తప్ప మరేమీ లేవు. మీరు చావలేక బతుకుతున్న శవాలుగా వున్నారు. మీ పిల్లలు ఆకలిచావులు ఛస్తున్నారు. ఎదిగిన పిల్లలకి పని దొరక్క దొంగలుగా మారారు. ఈ స్థితిలో మీరు మీ కనీసావసరాలకై పోరాడండి''

అతనిలా చెబుతూనే వున్నాడు. పోలీసులొచ్చారు.

''నన్నెందుకు అరెస్టు చేస్తున్నారు?'' అడిగాడు లాయర్ కోపంగా చూస్తూ.

''అదేదో వచ్చి స్టేషన్లో కనుక్కో'' రఫ్‌గా లాక్కెళ్తున్నట్లుగా ఈడ్చుకెళ్లారతన్ని. జనం పోలీసు వ్యాన్ చుట్టూ మూగారు. పోలీసుల లాఠీలు వారి వీపులపై మోత మోగించాయి. పోలీసు వ్యాన్ లాయర్ని తీసుకుని వెళ్లిపోయింది. కుబేర్రావ్‌ని సగౌరవంగా కారెక్కిస్తున్నాడు సబిన్స్‌పెక్టర్. భక్తితో చేతులు జోడించాడు. కుబేర్రావ్ విలాసంగా ఓ చిరునవ్వు అతనిపై విసిరి కారులో దర్జాగా వెళ్లిపోయాడు.

సబ్‌ఇన్స్‌పెక్టర్ హుషారుగా లోపలికొచ్చాడు. డ్రాయర్ ప్రక్కగా వున్న లెదర్ బ్యాగ్ తెరిచి మరోసారి చూసుకున్నాడు. అతని కళ్లల్లో తళుకే తళుకు, భద్రంగా బ్యాగ్ డ్రాయర్ సొరుగులో దాచి తాళం వేశాడు.

కానిస్టేబుల్స్ న్యాయవాదిని లోపలికి తీసుకొచ్చారు.

ఎస్సై అతనివైపు కోపంగా చూస్తూ ''ఏం లాయరూ గడబిడ చేస్తున్నావుట. బతకాలని లేదా?''

లాయర్ ఆశ్చర్యంగా చూసి ''నేను గడబిడ చేస్తున్నానా? నేనేం రాజకీయవాదిని కాను, అలాటి పనులు చేయడానికి. కార్మికులకేం కావాలో అవి ఎలా సాధించుకోవాలో చెబుతున్నా'' అన్నాడు.

''వాళ్లకేం కావాలో, ఏం ఇవ్వాలో మాకు తెలుసు. నువ్వే చెప్పాలా! నీ...(బూతు తిట్టు) నిన్ను రెండ్రోజులు లాకప్పులో వుంచి నలగబొడిస్తేగాని దారికి రావు''

''ఇదన్యాయం'' అరుస్తున్నాడు లాయర్. ఎవ్వరూ అరుపులు పట్టించుకోలేదు.

కార్మికులు తమ లాయర్‌కోసం స్టేషన్‌కొచ్చారు.

పోలీసులు బెదరగొట్టారు.

పత్రికలవాళ్లడిగారు.

''శాంతిభద్రతల దృష్ట్యా ముందుచూపుతో అరెస్టు చేశాం. అంతే. రెండ్రోజుల్లో వదిలేస్తాం'' అన్నారు పోలీసులు.

మర్నాడు ఉదయానికి లాయరు గుండె ఆగి చచ్చిపోయాడు.

కార్మికులంతా గోడుగోడున ఏడుస్తున్నారు. వాళ్లకి శవం అప్పగించబడింది.

''ఇంత ఘోరమా! నిన్న బాగా మాట్లాడాడు. ఆరోగ్యంగా వున్న మనిషి ఇంతలో ఎలా పోయాడు?'' అరిచినట్లే అడిగాడు సూరీడు.

''వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరు చెబుతార్రా? మహానుబావుడు రాత్రి బాగానే వున్నాడు. అర్ధరాత్రి దాటాక పోయినట్లుంది ప్రాణం. డాక్టర్ని పిలిపించాం. హార్ట్ ఫెయిల్యూర్ అన్నాడు''

విశదీకరించాడు హెడ్‌కానిస్టేబుల్.

సూరీడది విని కోపంగా పోలీసుల్ని నెట్టుకుంటూ లోపలికెళ్లాడు.

అప్పటికే ఎస్సై దగ్గర పత్రికలవాళ్లు ఇద్దరున్నారు. వాళ్ల ప్రశ్నలకి ఓపిగ్గా జవాబులిస్తున్నాడు ఎస్సై.

''ఇదిగో డాక్టర్ సర్టిఫికెట్ కాపీ'' వాళ్లిద్దరికీ చెరో కాపీ ఇచ్చాడు ఎస్.ఐ

''కాదు. ఇది లాకప్ చావు. మీరే చంపేశారు'' అరిచాడు సూరీడు.

ఎస్సై వాణ్ణి పురుగులా చూశాడు.

కానిస్టేబుల్స్ సూరీణ్ణి బైటికి లాక్కొచ్చారు.

లాయర్ శవాన్ని కార్మిక వాడ సెంటర్లో పడుకోబెట్టారు.

''సూరీడు... బాబుగారు'' అంటూ ఏడుస్తూ వచ్చింది సీతాలు.

సూరీడుకి ఏడుపు రావడంలేదు. ఆవేశం, కోపం, నిస్సహాయత వాణ్ణి ఊపేస్తున్నాయి. సీతాలు వాడి చెవిదగ్గర నోరుపెట్టి ''దీనికంతటికీ కారణం ఎవరో తెలుసా?'' అంది.

''పోలీసోళ్లు'' అన్నాడు సూరీడు.

''ఆళ్లుగూడాననుకో. అసలు కారణం సేటు''

''ఆ!''

''ఔను. ఆ సచ్చినోడే ఎస్సైకి లంచమిచ్చి లాయర్‌బాబుని సంపిచ్చినాడు''

''నీకెట్లా తెలిసిందప్పా''

''ఎవరో గొప్పోల్లంతా కార్లలో మనూరు సూడ్డానికొచ్చిన్రట. నా పెద పిలగాడు ఆకలేసి రొట్టె పెట్టమని అడిగితే కసిరి కొట్టిన్రట. ఆళ్ల మాటల్లో పడడం సూసి ఈడు ఓ రొట్టెముక్క అందుకుని లగెత్తిండట. వాళ్ల వెంటపడి సిన్న పిలగాడనైనా సూడక కొట్టి స్టేషన్‌కి తీస్కపోయిన్రట. అప్పుడు సేటక్కడికొచ్చి ఎస్సైకి పైసలిచ్చి లాయర్ సంగతి చూసుకోండి మరి'' అన్నాడట.

''మీకేం భయంలేదు. నే చూసుకుంటానంతా'' అన్నాట్ట ఎస్సై.

''ఔను. వాడెంత దుర్మార్గానికైనా తగినోడే. ఇది వాడిపనే'' కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు సూరీడు.

లాయర్ శవాన్ని బండిమీదకెత్తారు.

దొడ్లలో, పూలమొక్కల పూలన్నీ కోసి దండలు కట్టుకొచ్చి ఆయన మెడలో వేశారు. పూలు చల్లుకుంటూ ఊరేగింపుగా లాయర్ని తీసుకెళ్తున్నారు. జనం చూశారు. సానుభూతి



## వెల్లుల్లి వద్దు

అమెరికాలోని వాటర్‌లూ నగరంలో వెల్లుల్లి తినకూడదనే శాసనం వుందిట. క్షురకులు మాత్రమే తమ పనివేళల్లో వెల్లుల్లి తినకూడదనే రూలుందిట. ఉదయం 7 గంటలనుండి సాయంకాలం 7 గంటలదాకా బార్బర్సు వెల్లుల్లి తినరాదు. లేదా తమ వృత్తిని విడిచిపెట్టేయాలి.

- అచ్యుతుని రాజ్యశ్రీ

కనపరిచారు. ''పాపం! ఎంత మంచివాడో! ఇస్తేతప్ప ఫీజు ఇంతివ్వమని ఎన్నడూ అడగలేదు.

''ఎప్పుడూ ఆ కార్మికులవైపే మాట్లాడుతుండేవాడు. నాలుగు డబ్బులు వెనకేసుకోవాలని లేదు.

''సంపాదించిన నాలుగు డబ్బులు కూలోళ్ల పిల్లలకోసమే ఖర్చుపెట్టాడు. పిచ్చాడు''

తలా ఓ రకంగా లాయర్ మంచితనం, చేతగానితనం, అసమర్ధతలగురించి, తలోరకంగా అనుకొన్నారు.

ఊరేగింపు సాగుతోంది. ఊరేగింపు ముందుగా సత్యదేవత నడుస్తోంది.

లాయర్ని సమాధిచేశారు. ఆ సమాధిపై సత్యదేవత కన్పించింది సూరీడుకి.

విచార వదనాలతో వెనక్కి తిరిగారు.

కార్మికులు తమకు జరిగిన అన్యాయానికి, లాయర్ మృతికి కోపంతో కుబేర్రావ్ ఇంటిమీదకెళ్లారు. అప్పటికే పోలీసుల్ని కాపలాగా పెట్టుకున్నాడు సేటు. లాయర్ మరణానికి పోలీసులు, కుబేర్రావ్ కారణమంటూ కార్మికులు అరుస్తున్నారు. లాఠీఛార్జి ప్రయోగించారు. ఎస్సై ముందుకొచ్చి ''మర్యాదగా చెబుతున్నా! ఇక్కణ్ణుంచి వెళ్లిపోండి. సిటీలో పరిస్థితి బాగాలేదు. మీరిక్కడ గొడవచేశారంటే ఫైరింగ్ చేయాల్సొస్తుంది'' అంటూనే గాల్లోకి కాల్చాడు.

ఈ హడావుడిలో రౌడీమూక చేరింది. వాళ్లు కార్మికుల్లో కలిసిపోయి రాళ్ళు, సోడాలు పోలీసులమీదికి విసిరారు. పోలీసులు కొందరు గాయపడ్డారు.

పోలీసులు కాల్పులు జరిపారు.

కార్మికులు నేలకొరిగారు. రక్తం రోడ్డుని తడిపింది.

కుబేర్రావ్ ఇంటిమీద రాజకీయ తేజస్సు వికటాట్టహాసం చేసింది. రక్తపు తడిలోంచి సత్యదేవి లేచింది.

సత్యదేవి నవ్వింది.

ఆమె దివ్యతేజస్సు క్రమంగా కరిగిపోసాగింది.

సత్యదేవి మెల్లగా, మెలమెల్లగా పైకి అలా పైపైకి వెళ్లి అనంత విశ్వంలో లీనమైంది.

◆ ❖ ◆



పురంధరుడు.          జమ్మలమడుగు